# ప్రయాణంలో ముచ్చట్లు

ఈమధ్య రైలు ప్రయాణాలమీద ఎన్ని కథలయినా వింటున్నాం. రైలుబండి ఓఛోటా భూలోకం కాబట్టి ఆ లోకంలోని ఎగుడు దిగుడులు చూడకుండా ఎట్లా ఉండగలం? తెల్లారితే ఏదో పని; అంచాత ఎక్కడికో ప్రయాణంఉంటూనే ఉంటుంది.

చేస్తూన్న పనిలో సంగతులు; జరుగుతూన్న ప్రయాణంలో ముచ్చట్లు లేకుండా ఎట్లా ఉంటాయి? మానవమాత్రుడైనవాడు బెల్లంకొట్టిన రాయిలా ఉండలేడు కదా! రైలెక్కుతాడు; నోరు విప్పుతాడు. ఏపనీ లేకుండా ఉంటున్నాడని అంటారుగాని మాట్లాడే పని చేస్తున్నాడని ఎందుకనరో! నిజానికి అందులో మాత్రం సంపాదన లేదా? ఎదుటివారి హృదయాలనైనా—కనీసం డబ్బు రాబట్టలేకపోయినా — సంపాదించవచ్చు. ఇక ఈ పనిలో ఎంత కిట్టింపు లేకపోతే రాజకీయ నాయకులు ఇందులో ఎందు కంతిదిగా తరిఫీదు పొందుతారు? 'లెక్చర్లు దంచడం' కాదు అంటారు కాని మరి ఆ ఉపన్యాసా

లెంతెంత వెనకేసు కుంటున్నారో ఎవరికి తెలియదు ? ఈ మధ్య ఉపన్యాసాల జోరులేక 'బ్రతికాం' అనుకున్నాం గాని ఇక ఎన్నికల సంరంభం దగ్గర పడింది కాబట్టి ఇక కంఠా లంబరవీథిని వీర విహారం చేస్తాయి. కన్ను మూసేవారిని మిన్ను విరిగి మీదపడిపోతూన్నట్టు, తెన్ను చూసుకోమని వెన్నుతట్టి మరీ లేపుతారు. వోటిమ్మని అడుగుతారు. కోటి రూపాయల విలువచేసే వోటు నేమో కోటుజేబులో వేసుక పారిపోతారు.

అయితే రైలుబండి మాట చెప్పి ఉపన్యాసాల పాట లోకి జారిపోయ్యా వేమిటయ్యోయ్ అని అప్పుడే అనేసెయ్యకండి. కొంచెం ఓపిక పట్టండి.

నిజానికి మా పెట్టెలో అనేకరకాల ముతావాదులంతా పీఠం వేసుకొని పుఠం వేసినా పనికిరాని తమ చిట్టాలు విపులంగా విప్పుక కూర్చున్నారు.

రైలు పట్టాలను పీకే వాళ్ళ దగ్గరనుంచి, భూములను దాన పట్టాలుగా పొందే వాళ్ళ వరకూ పోయారు. ఒకాయన నరసాపురం రూటుకు పోతానంటే, మరొకాయన "అటుపోతే బస్సురూటెట్లా వస్తుందోయ్ వెర్రిపుల్లయ్యా ఇలా నేరుగా పోదాంరా" అంటూ ఆయన్ను ఆపటానికి ప్రయత్నిస్తున్నాడు. నిలబడి వున్న ఒకాయన నిలువుగాళ్ళతో సతమతమౌతూ "సీటు దొరికితే బాగుండు"నని అనుకుంటూ ఉంటే "ఎక్కడి

సీట్లుండీ, క్లాసొచ్చినా కాలేజీలో సీటిచ్చారు కాదు" అని ఓ విద్యార్థి వాపోయాడు.

ఇంతలో ఓ చిలిపికళ్ళ చిన్నవాడు "దొంగలున్నారు జాగ్రత" అన్న అక్షరాలను, పట్టిపట్టి చదివి "ఎవరు దొంగలండి బాబూ ?" అని ఓరచూపు చూసేసరికి ప్రక్కనున్న పండంటి ముసలాయన "బాబూ ఇంతకుముందు కాంగ్రెసులో పెద్దమనుషులున్నారు, వోటు వాళ్ళకుమాత్రమే ఇవ్వండి" అని ప్రచారం చేసే వాళ్ళం. ఇప్పుడదంతా తారుమారైంది కాబట్టి "కాంగ్రెసులో దొంగలున్నారు జాగ్రత" అని సంచారం చేస్తున్నాను. అని ఓ దగ్గు దగ్గాడు. వెంటనే ఇంకొక పెద్దమనిషి "మీకా దొంగలతో వాటా తెగలేదేటండి బాబూ; రంగు ఫిరాయించారు" అన్నాడు. వెంటనే అంతా గొల్లున నవ్వారు. ఈ నవ్విన వాళ్ళలో ఒకాయన తాపీగా చుట్ట ముట్టించాడు. "ఏమండోయ్ మీరు చుట్ట కాలిస్తే నాకు పడదు. కాస్త మానెయ్యండి. మాకిష్టం లేకపోతే మానెయ్యాలి కూడాను" అన్నాడో సద్బుద్ధి. ఇంతలో 'పొగతో నడుస్తున్న బండిలో పొగ లేకపోతే ఎట్లా సార్" అంటూ మరో సోదరుడు సిగరెట్టు ముట్టించి, 'ఇది చుట్టంత డేంజరు కాదులెండి' అని ఓ వెకిలినవ్వు నవ్వాడు. ఇంతలో మా బండి నిడదవోలులో ఆగిపోయింది. మా బండి కెదురుగుండా మరోబండి రాజమండ్రి పోయేది వచ్చి ఆగింది.

ఆ బండిలోనికి బియ్యం, రాజమండ్రి నగరానికి సరఫరా చెయ్యాలని ఎవరికి తోచినవి వారు చేరవేసి ఉడుతసాయం చేస్తున్నారు. ఇది మా పెట్టివాళ్ళను ఆకర్షించింది. "అయ్యా చూశారూ, దొంగబియ్యం యెట్లా రవాణా అవుతున్నయ్యో! పల్లెల్లో కావలసినంత సరకు. మన పేపర్లలో కావలసినంత తరుగు. ఇదేమి చిత్రమో! ఒక్కడూ వీళ్ళను పట్టుకోడు" అని బాధపడ్డారు. ఇంతలో ఓ బుష్‌కోటాయన "పాపం వాళ్ళేమి చేశారండీ. వీళ్ళను పట్టుకుంటే కుంచెడు దొరికేను, రెండు కుంచాలు దొరికేను. పెద్దపెద్ద ధాన్యం పురులు, దొడ్లల్లో దాచి గోడ్లకు పెడుతూన్న వాళ్ళను పట్టుకోవాలి గాని-ఇంతకీ ఎవర్నని ఏముందిలెండి. ఆ పెద్ద ఆసాములదగ్గరకు పోవటానికి గుండెలు ఉండవు. కాని ఈ బిచ్చగాళ్ళ గుండెలు తీయటానికి కావలసినన్ని తుపాకిగుండులున్నాయి" అనేసరికి అంతా అతనివైపే చూశారు. ఈమాట వినగానే ఒకాయన మరొకాయన చెవిలో "కమ్యూనిస్టేమిటోయ్" అన్నాడు గోడలకు చెవులున్నట్టే రైలు పెట్టెలకు చెవులుండడం సహజం గాబట్టి "ఏ యిస్టు అయితే నేమిలెండి. కాంగ్రెసుకు వ్యతిరేకి అయితేసరి. మిగతావారి కందరకూ ఇష్టుడే" అని ఓ మీసాలాయన అనేసరికి అంతా పకపకా నవ్వారు. మాబండి లంఖనాల బోటులా నడుస్తూండటమే కాకుండా కొంతమంది కళ్ళల్లో బొగ్గు నలుసులు చల్లి లంఖనాలుచేసినవాడి మొఖంలా పీడ మొఖాలను తయారుచేసింది. అది యెల్లాగో ఓలాగ

తాడేపల్లిగూడెం చేరేసరికి ఉన్న జనం చాలరన్నట్టుగా, జనం విపరీతంగా కోటాగుడ్డకు, సినిమా టిక్కెట్లకు యెగబ్రాకినట్లు ఆడ మగ వివక్షతలేకుండా "అంతా ఒక్కటే" అన్న నినాదం ధ్వనించేట్టుగా ఏకమయి త్రోసుకొని, త్రొక్కుకొని దిగే వారిని దిగనివ్వకుండా యెక్కేవారిని యెక్కనివ్వకుండా బ్రతికే వారిని బ్రతకనివ్వకుండా చచ్చేవారిని చావనివ్వకుండా ఎవరి ఆదుర్దాలలో వారు, ఎవరి ఆతృతల్లో వారు పెట్టెలు విసిరి కాళ్ళు విరిచేస్తూ, మూటలు లాగి తలకాయలు చిదుగ పొడుస్తూ చిన్న చిన్న కలహాలతో దిగినవాళ్లుదిగిపోగా యెక్కిన వాళ్ళు యెక్కారు. ఇదిచూసి మా పెట్టెలోని ఓ మనిషి, అమాంతంగా సన్యాసిగామారిపోయి "అయ్యో! ఈప్రయాణాలు రోజురోజుకూ పాపాల్లా పెచ్చు పెరిగి పోతున్నాయి. ఇదేం కర్మమో" అని గిలగిల కొట్టుకుంటూ ఉంటే "రైలు తాపాలు కూడా హెచ్చుగానే ఉన్నాయి" అన్నాడు మరొకాయన; భుజాలుతాసుకపోయిన ఓఅబ్బాయి అమ్మాయిాలవైపుచూస్తూ.

ఇదే సమయంలో రైలు నడుస్తూండగానే మా పెట్టె లోనికి ఓ అబ్బాయి వచ్చాడు. ఐతే ఆ అబ్బాయి అడుక్కునే వాడు కావడంవల్ల అతను ఓ పాట పాడటానికుద్యుక్తుడయ్యాడు. ఆపాట పాడకపోతే మాత్రం అతన్ని ఎవ్వరూ అడుక్కునే వాడని అనుకోరు. అయితే అడుక్కునేవాడిట్లా ఉండాలని ఎక్కడైనా వ్రాసి ఉందేమిటి ? ఇలా శుభ్రంగా ఉండటంకూడ ఓ అందుకు మంచి దేకదా ! మనుష్యుల మధ్యనుంచి తిరిగేప్పుడు

ఎవ్వరూ అసహ్యించుకోరు. ఐతే ఆ కుర్రవాడు బలే పాటొకటి పాడాడు. చాల శ్రావ్యంగా కంఠమెత్తాడు. ప్రతి ముక్కా చెవుల్లో గింగురుమనేట్టు, గుండెల్లో నిండుకొనేట్టు పాడాడు. పర్మిట్లగురించి, ప్రాజెక్టుల గురించి, ఇక ముఠాల దగ్గరనుంచి రాజకీయ నాయకుల ప్రాబల్యం మీదినుంచి, ఐక్యరాజ్య సమితి పటాటోపంవరకూ పయనం సాగించాడు. వాడిగా దాడి చేశాడు. వేడిగా నిట్టూర్పు విడిచాడు. కాలమంతా వాడిపోల మన్నాడు. లోకమంతా శోకమయమన్నాడు. ఇలా యెన్నో అన్నాడు. అలా అన్నీ అని చెయ్యి చాచాడు. గుమ్మడికాయ దొంగంటే భుజాలు తడువుకున్నట్టు ఏమంటే తమమీద పడిపోతుందో ఏమో అని ఒక్కడూ అతని కడ్డు ప్రశ్న వేయలేదు. మౌనం అంగీకార సూచకమైనా అనుకోలేదు. ఐనా చేసిన పాపాలు చెపితే పోతాయన్నట్లు, చేసిన తప్పులు తామే ఆ అబ్బాయితో డబ్బా వాయించుకొని పాపాన్ని అతనికిచ్చిన డబ్బులతో కడిగేసుకుంటూన్నట్టు, అతను అడగటమే తడవుగ, కానీ కాదు, అర్ధణా కాదు ఒక్కొక్క అణా ఇచ్చారు. ఇదంతా చూసి సహించలేకో ఏమో ఓ వాది, న్యాయవాది అనుకున్నా సరే, రాజకీయవాది అనుకున్నా సరే అతని కదో వ్యాధి అనుకుంటాను. తిన్నగా కూర్చొక, "ఏం అబ్బాయి, ఇట్లా ప్రభుత్వాలను, పార్టీలను తెగనాడుతూ, వాటి సంగతి పూర్తిగా తెలియకపోయినా అర్థం లేకుండా ఏవో నాలుగు విమర్శలు చేయడమే ఓ గొప్ప అనుకొని, నోటికొచ్చినట్టు వాగుతూ ఇలా నీచంగా అడుక్కునే బదులు

ఏదైనా పని చేసుకోరాదూ" అని అనేసరికి అంతా భేష్ భేష్ అన్నారు. అయితే ఆ కుర్రవాడు జవాబు చెప్పకుండా పోలేదు. ఒక్కసారిగా ఆ అబ్బాయి "అయ్యా నే నడుక్కో వటం లేదు" అన్నాడు. "అయితే మరిదేమిటీ" అన్నట్టుగా అంతా మహదాశ్చర్యంతో అతనిలోకి విలోకించారు. అప్పుడా అబ్బాయి "నేను పాడటమనే పని చేస్తున్నాను. అది మీకు నచ్చింది. అందుకు డబ్బులిచ్చారు. ఇంత ఇమ్మని నే నడగలేదు. ఇవ్వనివాళ్ళను నేనేమీ అనలేదు. నిజంగా ఇందువల్లనే, నే నడుక్కునేవాడి నయ్యాను కాబోలు! మోళీవాడు వస్తాడు. విద్య చూపిస్తాడు. మీకు నచ్చితే డబ్బులిస్తారు. లేకపోతేచూసి వెళ్ళిపోతారు. పాములవాడు వస్తాడు. పాములను చూపి ఆడిస్తాడు. మెచ్చిన తల్లులు బియ్యంపోస్తారు. మెచ్చని అమ్మలు చూసి ఊరుకొంటారు. పంతులుగారు వస్తారు. తిథి వార నక్షత్రములు, దుర్ముహూర్తాలు చెప్తారు. వాటిమీద నమ్మక మున్నవాళ్ళు ఆయవారం పెడతారు. లేనివాళ్ళు బియ్యం నిండు కున్నాయని పొమ్మంటారు. రాజకీయవాది వస్తాడు. తన సత్తా, తన పార్టీ గొప్పతనమూ మీ ముందు ఏకరువు పెడతాడు. వోటిమ్మని అడుక్కుంటాడు. అతని గుణ గుణాల్నిబట్టి ఇచ్చినవాళ్ళు ఇస్తారు లేనివాళ్ళు లేదు. ఇందులో తప్పేముంది? తెల్లారితే ప్రపంచంలో అడుక్కోని వాళ్ళెవరు? ఇది నా విద్య. నే చేసింది తప్పుకాదు. ఇక నేను నోటికొచ్చినట్లు వాగినట్లు మీరు సెలవిచ్చారు. అట్లా చేసేది మీరుకాని నేను ఎన్నటికీ కాదు. రోజుకో పార్టీలోకి

మారుతూ, పార్టీ సూత్రాలను విడచేసి ఇతర పార్టీలతో చేతులు కలుపుతూ, మంచి చేస్తాం అని చెప్పి పబ్బం తీరిన తర్వాత అందుకు భిన్నంగా ప్రవర్తించేవాళ్ళు మీరే. మీ మాటలకు చేతలకు సంబంధం ఉండదు" అంటూ ఆ అబ్బాయి ఇంకో పెట్టెలోనికి వెళ్ళిపోయాడు.

అంతా నోరు వెళ్ళబెట్టి అతనివైపు చూస్తూ మాట లేని మనుష్యులైపోయారు.

నామట్టుకు నేను ఇక మన దేశంలో అడుక్కునేవాళ్ళు లేరని అతను చెప్పిన దాన్నిబట్టి నిర్ణయించుకున్నా.

ఇంతలో మా స్టేషను వచ్చేసింది. అయ్యో! ఇంకా ఇలాంటి ముచ్చట్లు ఎన్నో చూడకుండానే దిగిపోవలసి వచ్చిందే —అన్న బెంగతో దిగిపోయాను.

నిజానికి దిగిపోయే సమయం వచ్చినప్పుడు ప్రైమ్‌మినిస్ట రయినా దిగిపోక తప్పదు కదా!

ఇంతకీ ఆశ్చర్య పడవలసిన విషయ మేమిటంటే ఆపాట పాడిన అబ్బాయిని ఎవరో పట్టుకొని "ఇంకెక్కడికి పోతావురా దొంగ వెధవా. ఇక ఇంట్లో నిన్ను కట్టేస్తాను" అన్న ముక్క లా స్టేషనులో విన్నాను.

"అయితే ఈ ప్రపంచంలో ఎవరుచెప్పేది నిజంబాబూ?" అని నా వెనకాలే ఎవరో ప్రశ్నించినట్లయింది.

నేనేం జవాబు చెప్పను?

——